సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ၊ 30 ၊ అక్టోబర్ ၊ 2024



మాతాశిశు మరణాలు అరికట్టాలి

మాతాశిశు మరణాలను అరికట్టేందుకు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. 8లో



బాణసంచా దుకాణాల తనిఖీ

ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా బాణసంచా విక్రయాలు జరపాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. 8లో



150 కిలోల గంజాయి పట్టివేత

అడుగులపుట్టు పంచాయతీ కొత్తాపుట్టు జంక్షన్ వద్ద 150 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

- ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరిక



పాడేరు : అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరించారు. అనుమతులు పొందిన తయారీదారులు, అమ్మకందారులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ క్రయవిక్రయాలు జరపాలని సూచించారు. జిల్లాలో శాశ్వత, తాత్కాలిక బాణసంచా లైసెన్సు దుకాణాలు కలిగి వారు మాత్రమే క్రాకర్స్ విక్రయించాలన్నారు. తాత్కాలిక లైసెన్స్‌దారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లు వేసి, దుకాణాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జనావాసాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులకు దూరంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలంతా దీపావళి పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, బాణసంచా కాల్చేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కోరారు.

త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు

చింతపల్లి: త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని నీటిపారుదలశాఖ ఏఈఈ లోకేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చింతపల్లి మండలంలో తాజంగి, సిరిపురం, చౌడుపల్లిలోని పెద్ద చెరువుల పరిధిలో నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఆయకట్టు రైతులంతా సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లను రైతులు సరిచూసుకోవాలన్నారు. పేర్లలో మార్పులు చేర్పులు చేయాల్సిన వారు, ఓటర్లుగా నమోదు కావాలనుకున్న వారు తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆకాశంలో మబ్బులు.. అన్నదాతల్లో గుబులు

పొలం కన్నుల పండువగా ఉంది... బంగారు వర్ణంలో మెరిసిపోతున్న వరి కంకులను చూసిన అన్నదాతలు ఆనందంతో ఉబ్బితబ్బిబవుతున్న తరుణంలో ఆకాశంలో మబ్బులు కమ్ముకొస్తున్నాయి... పంట చేతికందే సమయంలో అక్కడక్కడా వర్షాలు పడుతుండడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట దక్కుతుందో లేదోనని భయాందోళనలు చెందుతున్నారు.

- ఉదయం మంచు.. మధ్యాహ్నం మబ్బులు
- రాత్రి సమయంలో అక్కడక్కడా వర్షాలు
- కోత దశలో ఖరీఫ్ వరి
- వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన



వంజంగి ప్రాంతంలో ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు



హుకుంపేటలో కురుస్తున్న వర్షం



లగిశపల్లి ప్రాంతంలో కోతకు సిద్ధమైన వరిపంట

సాక్షి,పాడేరు: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిపంట ఆశాజనకంగా ఉంది. పంట చేతికందితే తమ కష్టాలు తీరుతాయన్న ఆశలో గిరిరైతులు ఉన్నారు. ఈ తరుణంలో వాతావరణంలో మార్పులు వారిని భయపెడుతున్నాయి. వేకువజాము నుంచి దట్టంగా పొగమంచు కురుస్తుండగా, మధ్యాహ్నం వరకు ఎండకాసి, ఆ తరువాత నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. రాత్రివేళ అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఇలా విభిన్న వాతావరణం మూడు రోజుల నుంచి జిల్లాలో నెలకొంది. ఈ వాతావరణం రైతులు కలవరపెడుతోంది. ఖరీఫ్ వరి కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో కురుస్తున్న వర్షాలు, మబ్బు వాతావరణంతో అన్నదాతలు భయపడుతున్నారు.

50వేల హెక్టార్లలో...

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 56,792 హెక్టార్లు కాగా, ఈ ఏడాది 50వేల హెక్టార్లలో వరినాట్లు పడ్డాయి. చింతూరు డివిజన్ మినహా పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో పంట ఎదుగుదల బాగుంది. ముందస్తుగా వరినాట్లు వేసిన 60 శాతం భూముల్లో కోత దశలో పంట కళకళాడుతోంది. ఈ పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, కురుస్తున్న వర్షాలు పంటకు నష్టం చేకూర్చేలా ఉన్నాయి. పాడేరు డివిజన్‌లోని 16,376 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతున్న చోడి, నాలుగువేల హెక్టార్లలోఉన్న సామలు,కొర్రలు వంటి చిరుధాన్యాల పంటలు కూడా కోత దశలోనే ఉన్నాయి.భారీ వర్షాలు కురిస్తే ఈ పంటలు పూర్తిగా నేలరాలే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం చోడి కోతలు జరుగుతున్నాయి. కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు రైతులు తరలిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో వర్షాలు

జిల్లాలో పలు చోట్ల మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం కొయ్యూరులో 26.8 మిల్లీమీటర్లు, డుంబ్రిగుడలో 18.4, దేవీపట్నంలో 9.4,అనంతగిరిలో 2.2, హుకుంపేటలో 1.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. మొత్తం 58.6 మిల్లీమీటర్లు నమోదు కాగా, మంగళవారం ఉదయం పెదబయలులో 6.4, ముంచంగిపుట్టులో 3.2, కొయ్యూరులో ఒక మిల్లీమీటరు వర్షపాతం కురిసింది. మొత్తం 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాయంత్రం నుంచి హుకుంపేటతో పాటు పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది.

అప్రమత్తంగా ఉండాలి



తుపాన్లు లేనప్పటికీ జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి. తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి.పంట కోతల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.స్థానికంగా వ్యవసాయ అధికారులు,అసిస్టెంట్ల సలహాలు,సూచనలు తీసుకున్న తరువాతే పంట కోతలు చేపట్టాలి.

– అప్పలస్వామి, ఏడీఆర్, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం

వర్షాలు కురిస్తే నష్టమే



వర్తనాపల్లిలో కౌలుకు తీసుకున్న ఎకరం భూమిలో వరి సాగు చేస్తున్నాను.ఈఏడాది పంట ఆశాజనకంగా ఎదిగింది. ఇప్పుడు కోత దశకు చేరుకుంది.ఈవారంలో పంట కోతలు చేపడదామని అనుకుంటున్న సమయంలో వాతావరణ మార్పులు భయపెడుతున్నాయి. వర్షాలు కురిస్తే నష్టపోక తప్పదు.

– ఎస్.అప్పారావు, గిరిజన రైతు, లగిశపల్లి, పాడేరు మండలం

కోతలు వాయిదా వేసుకున్నాం



ఎకరం భూమిలో వరిపంట సాగుచేస్తున్నాను. ఎన్నో కష్టాలు పడితే.. పంట కోతదశకు వచ్చింది. కష్టాలు తీరుతాయని ఆశించాను. ఇంతలో మరో గండం వచ్చి పడింది. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పంట కోతలను మానుకున్నాను.భారీ వర్షాలతో పంటమునిగితే తిండి గింజలకూ ఇబ్బందులు తప్పవు.

– పాంగి నాగరాజు, గిరిజన రైతు, గడుగుపల్లి,హుకుంపేట మండలం

చిరుధాన్యాలకు ఇబ్బందే..



వర్షాలు కురిస్తే చిరుధాన్యాల పంటలకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది. చోడి, సామ, కొర్రల పంటలు కూడా కోత దశలో ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే పంట నేలవాలి గింజలు పాడైపోతాయి. దీంతో ఆరుగాలం కష్టం ఆవిరవుతుంది. కనీసం పెట్టుబడి సొమ్ముకూడా వచ్చే అవకాశం ఉండదు. తీవ్రంగా నష్టపోక తప్పదు.

– పోయిబ రాంబాబు, గిరిజన రైతు, అడుగులపుట్టు,పెదబయలు మండలం

ప్రకృతి సంపద ప్రజలందరికీ చెందాలి

- ఉచిత ఇసుక విషయంలో ఎలాంటి అక్రమాలను సహించం
- చట్టబద్ధంగా నడుచుకునే క్వారీ నిర్వాహకులకు తోడుంటాం
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మహారాణిపేట(విశాఖ) : ప్రకృతి ప్రసాదించిన వనరులను ప్రతి ఒక్కరికీ చెందేలా చూసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మైనింగ్ అధికారులు, క్వారీ నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మైనింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేసి మెరుగైన పాలనకు శ్రీకారం చుట్టబోతున్నట్టు చెప్పారు. క్రషర్ యజమానులు, మైనింగ్ కంపెనీల యజమానులతో సీనరేజీ వసూలు చేసే సంస్థలు సఖ్యతతో నడుచుకోవాలని ఆదేశించామన్నారు. పెత్తనం చేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలిపారు ఉత్తరాంధ్రలో అమూల్యమైన ప్రకృతి వనరులున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలనే ఉద్దేశంతో జులై 8న పాలసీ ప్రకటించినా.. వర్షాల వల్ల రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను ప్రారంభించలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. దాన్ని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఇసుక కొరతను నివారించేందుకు గోదావరి జిల్లాల్లో ఐదు రీచుల్ని ప్రత్యేకంగా కేటాయించామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంపునకు ప్రణాళికలు

కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో దేశీయ వ్యవసాయ ఉత్పాదకతతో పాటు రైతుల తలసరి ఆదాయం పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. వ్యవసాయ,ఉద్యానవన,పశుసంవర్ధక,మత్స్యశాఖ,సెరీకల్చర్ అధికారులతో మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గిరిజన రైతు వ్యవసాయ,అనుబంధ విభాగాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూములను గుర్తించాలని, అన్నదాతలను రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో చేర్పించాలని తెలిపారు. మూడు మండలాలను ఎంపిక చేసి పంటలు,ఉద్యానవనాలు,పశుసంపదపై సర్వే చేయాలని సూచించారు. వ్యవసాయానుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులు ప్రస్తుతం పొందుతున్న వార్షిక ఆదాయంలో రానున్న ఐదేళ్లలో రెండింతల పురోగతి సాధించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. సర్వేలో భౌగోళిక పరిస్థితులు, నీటిపారుదల, సంస్థాగత ఆర్థిక పరిస్థితులు,సామాజిక వర్గం,వ్యవసాయ భూముల రకాలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో ఎస్.ఎస్.ఆర్.కె.పట్నాయక్, పలుశాఖల అధికారులు ఎస్.బి.ఎస్.నందు, రమేష్‌కుమార్‌రావు, నరసింహులు,అప్పారావు,వెంకటరావు పాల్గొన్నారు.

విజన్ 2047కు అనుగుణంగా అభివృద్ధి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విజన్ 2047కు అనుగుణంగా అన్ని రంగాల్లో 15శాతం వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో వృద్ధి శాతం పెరగాలన్నారు. అన్నిశాఖలపై సమీక్షించారు.పశుగణనను ప్రారంభించాలని,పశుసంపదతో పాటు వాటి ఉత్పత్తులు పెరగాలన్నారు. ఉద్యానవనశాఖ ద్వారా నర్సరీలు ఏర్పాటు చేయడంతో పాటు ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో 2,3 ఎకరాలకే సాగు పరిమితమవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి కనీసం 90రోజుల పని దినాలు కల్పించాలని, జాబ్‌కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. సహకార, మత్స్యశాఖ, విద్యాశాఖలతో పాటు ఆధార్ శిబిరాల ఏర్పాటుపైన కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు బదిలీకి ఆన్‌లైన్ పేమెంట్

- పంచాయతీరాజ్‌లో లోపించిన పారదర్శకత
- ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ బదిలీల్లో అక్రమాలు
- జెడ్పీ సీఈవో విచారణలో వెలుగులోకి వస్తున్న కొత్త అంశాలు

మహారాణిపేట (విశాఖ): పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీల వ్యవహారం చిచ్చు రేపుతోంది. ఆన్‌లైన్ వేదికగా లంచాలకు తెరలేపడంతో ఈ వ్యవహారం ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని ఆందోళన రేగుతోంది. ఉమ్మడి విశాఖ కేంద్రంగా పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంటు కార్యనిర్వహణాధికారుల (ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ) బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. బదిలీల్లో పారదర్శకత లోపించింది. ఎవరైతే భారీగా డబ్బులు సమర్పించుకున్నారో వారికి కావాల్సిన చోట పోస్టింగులు దక్కాయి. ఈ వ్యవహారంపై గత నెలలో సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. విశాఖ కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తిని విచారణ అధికారిగా నియమించారు. విచారణలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీల జాబితా ఇవ్వాలని సీఈవో కోరిన విషయం తెలిసిందే. ఈ జాబితా ఇస్తే తమ లొసుగులు బయటపడతాయన్న కారణంగా సాంకేతిక కారణాలు చూపిస్తూ జాబితా ఇవ్వడానికి నాన్చుతున్నారు. ఇదిలావుండగా వాటాల్లో తేడాలు వచ్చి విభేదాలు తలెత్తడంతో ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవహారం బయటకు వచ్చింది. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా జరిగిన లావాదేవీలను కొంతమంది బయట పెట్టడానికి సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. బదిలీకి ముందు కొంత.. తరువాత కొంత డబ్బు ఇచ్చేందుకు ఉద్యోగులు ఒప్పందం కుదుర్చుకున్నారు. సాక్షి వరుస కథనాలతో కోరుకున్న చోటుకు బదిలీ అయిన ఉద్యోగులు మిలిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో పంచాయతీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. కొంతమంది ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారం చినికి చినికి గాలి వానగా మారడంతో ఆన్‌లైన్ పేమెంట్ చేసిన ఉద్యోగులు స్క్రీన్ షాట్లతో సంబంధిత అధికారులపై ఎదురు తిరుగుతున్నట్టు సమాచారం. జెడ్పీ సీఈవో మరింత పకడ్బందీగా విచారణ జరిపితే సూత్రధారులెవరో.. పాత్రధారులెవరో బయటపడుతుందన్న చర్చ నడుస్తోంది.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- డీఎంహెచ్‌వో జమాల్ బాషా



ఉప్ప పీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

హుకుంపేట: విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ప్రభుత్వ ఆస్పత్రుల సిబ్బంది గిరిజనులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, ఉప్ప పీహెచ్‌సీని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రుల్లో రికార్డులను పరిశీలించి, గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం ఉప్ప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రేఖ,ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్తీకమాసం ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, ఆలయ ధర్మకర్త సింహాచలంనాయుడు, కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి సమేత రాజరాజేశ్వరి ఆలయంలో వచ్చే నెల 2 నుంచి జరిగే కార్తీకమాసం ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, ఆలయ అర్చకుడు రామం, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ఇతర ప్రతినిధులు ఇమ్మిడిశెట్టి అనిల్‌కుమార్, సిద్దనాతి కొండలరావు, ముకుందరావు, మోద కొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, వర్తక సంఘం నేతలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ ఏడాది కార్తీకమాసం ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆలయ ధర్మకర్త తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి


ప్రసాదరావు మృతదేహం

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రా యి పెదఅంజోడ గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందినట్టు స్థానిక ఎస్‌ఐ కె.పాపినాయుడు తెలిపారు. పెద్ద అంజోడ గ్రామానికి చెందిన పాంగి ప్రసాదరావు(26) అనే యువకుడు మంగళవారం ట్రాక్టర్‌తో పొలంలో దుక్కుదున్నుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని కుటుంబ సభ్యులు అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

హౌసింగ్ అధికారుల అక్రమ వసూలు సరికాదు

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆగ్రహం
- వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం
- అధికారుల పనితీరుపై నిలదీసిన సభ్యులు


అక్రమ వసూళ్లపై హౌసింగ్ ఏఈని నిలదీస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: మండల స్థాయి అధికారుల తీరు మార్చుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీగా ఉండాలని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీహెచ్‌సీతో పాటు పీహెచ్‌సీలో అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని, గర్భిణులను ఆస్పత్రికి తరలించే క్రమంలో మారుమూల గిరిజనులు అవస్థలు పడుతున్నారని వైద్యులు గీతాంజలి ,ప్రతాప్‌లను సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి సమస్యను తీసుకువెళ్లాలని కోరారు. అనంతరం ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతుండగా మండలంలో పలు పాఠశాలలకు భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పక్కా భవనాలు మంజూరు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా ముంచంగిపుట్టులో విద్యార్థులు పాఠశాలల వేళల్లో బయట తిరుగుతున్నారని, ఏదైనా జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని సభ్యులు ఎంఈవోను నిలదీశారు. అనంతరం హౌసింగ్ ఏఈ కృష్ణారావు మాట్లాడుతుండగా పలు పంచాయతీల్లో ఎన్టీఆర్, పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన గృహాలకు బిల్లులు పెట్టాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆగ్రహించారు.

డబ్బులు ఇచ్చినవారికే బిల్లులు పెడుతున్నారని చైర్‌పర్సన్ సుభద్రతోపాటు సభ్యులు హౌసింగ్ ఏఈను నిలదీశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూస్, ట్రైబల్ వెల్ఫేర్, ఐసీడీఎస్, రెవెన్యూ శాఖాల అధికారులపై సభ్యులు ప్రశ్నించారు. దీంతో సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వైద్య శాఖ అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతగా పని చేయాలని, అంబులెన్స్ నిత్యం రోగులకు అందుబాలులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యంలో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదన్నారు, హౌసింగ్ అధికారులు గృహాల లబ్ధిదారుల నుంచి అక్రమ వసూలు చేయడం దారుణమని, వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. పలు శాఖల మండల స్థాయి అధికారులు గైర్హాజరుపై ఆగ్రహించారు. తీరు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీసాయిహర్ష, తహసీల్దార్ నర్సమ్మ, సీడీపీవో వరహాలమ్మ, పీఆర్ ఏఈ గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, పశువైద్యాధికారి సౌజన్యదేవి, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

వివేకానంద ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ స్వామి సేవ్యానందజీ


బాలికలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సేవ్యానంద స్వామీజీ

గంగవరం: యువత, విద్యార్థులు స్వామి వివేకానంద స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని రాజమహేంద్రవరం శ్రీ రామకృష్ణ మిషన్ వివేకానంద ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ సేవ్యానంద స్వామీజీ తెలిపారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, వ్యక్తిత్వ వికాసం సమాజ సేవా, భారతీయ సంస్కృతి, దేశభక్తి అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. తొలుత స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో స్వామీజీ మాట్లాడుతూ స్వామి వివేకానంద తన ప్రవచనాలు ద్వారా దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాల్లో చాటారన్నారు. భారతీయ మహిళల్లా ఉండాలని ప్రపంచ దేశాల వారు భావిస్తుంటారన్నారు. ప్రపంచంలో ఎంతో గౌరవం ఉందని, బాలికలు, మహిళలు ఆ పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నైతక శక్తిని పెంపోందించుకోవాలని, బాలికా విద్యకు స్వామి వివేకానంద ఎంతో కృషి చేశారన్నారు. నేడు బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వామి వివేకానంద జ్ఞాన పుస్తకాలను పంపిణీ చేశారు. ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.వరలక్ష్మి, బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణ, ఉపాధ్యాయుడు పాపారావు, పీడీ నాగమణి, ఆదయ్య, శ్రీ రామకృష్ణ మిషన్ సంచార వైద్యశాల కోఆర్డినేటర్ కె. శ్రీనివాసరావు, ఇంజనీర్ బి.ఆర్.ఎస్ శ్రీకాంత్, రోహిత్, సాయి వెంకట్, అధ్యాపకులు పాల్గొన్నారు.

150 కిలోల గంజాయి పట్టివేత

- కారు సీజ్, ముగ్గురి అరెస్టు

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ కొత్తాపుట్టు జంక్షన్ వద్ద మంగళవారం కారులో తరలిస్తున్న 150 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు స్థానిక ఎస్‌ఐ కె.రమణ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో వచ్చిన కారును పరిశీలించగా గంజాయి బయటపడినట్టు చెప్పారు. పెదబయలు మీదుగా ఒడిశా తరలించడానికిగా కారు డిక్కీలో పెట్టి రవాణా చేస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. రంగోీల పంచాయతీ చిట్టివలస గ్రామానికి కొర్రా నాగేశ్వరరావు, కిల్లో ప్రభాస్,ముంచంగిపుట్టు మండలం సుజనకోట గ్రామానికి చెందిన పాంగి శాంతికుమారిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్టు చెప్పారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన కారును సీజ్ చేసినట్టు తెలిపారు.

16న ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చరీ ఎంపికలు

పాడేరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా అండర్ 14, 17 ఆర్చరీ ఎంపికలు నవంబర్ 16న అరకువ్యాలీ స్పోర్ట్స్ స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మజీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యే అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల క్రీడాకారులు అర్హత పత్రం తీసుకురావాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వండలం కొండబాబు తెలిపారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

అడ్డతీగల: ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా బాణసంచా విక్రయాలు జరపాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్‌లో పేర్కొన్న విధంగా దుకాణదారులు బాణసంచా విక్రయించాలని తెలిపారు. అగ్నిప్రమాదాలు జరగకుండా పోలీసు శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సీఐ నరసింహమూర్తి,తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్‌ఐ వినోద్ పాల్గొన్నారు.

కోడి పందాల స్థావరంపై దాడి

ఎటపాక: మండలంలోని తునికిచెరువు సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో సీఐ కన్నపరాజు తన సిబ్బందితో పందాల స్థావరాన్ని చుట్టుముట్టడంతో పందెపురాయులు పరారయ్యారు. అయితే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ. 2 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పార్థసారథి తెలిపారు.

ఆటో బోల్తా ...ఇద్దరికి గాయాలు


గాయపడిన మహిళకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

సీలేరు: జీకేవీధి మండలంలో సీలేరు నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బ్రేకులు ఫెయిలై బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి, చింతూరు ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలాఉన్నాయి. పాలగెడ్డకు చెందిన ఇద్దరు మహిళలు సీలేరు వచ్చి పనులు ముగించుకుని తిరిగి ఆటోలో వెళ్తుండగా శాండికోరి గ్రామం వద్ద బ్రేకులు ఫెయిలవడంతో అదుపు తప్పి చిన్నపాటి లోయలో పడింది. ఈ ప్రమాదంలో కిముడు తులాపతి అనే మహిళ తీవ్రంగా గాయపడడంతో చింతూరు ఆస్పత్రికి తరలించారు.మరో మహిళ పాంగి మారెమ్మకు స్వల్పగాయాలయ్యాయి.

సెలూన్స్‌కు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షారపు సూరిబాబు

రాజవొమ్మంగి: సెలూన్స్‌కు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షారపు సూరిబాబు కోరారు. నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గ్రామదేవత నూకాలమ్మ ఆలయం వద్ద ధన్వంతరి స్వామి జయంతి ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇప్పటికే జారీ అయిన జీవోల ఆధారంగా నాయీ బ్రాహ్మణులకు న్యాయపరంగా అన్ని సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్‌కు కేటాయించిన నిధులు ఖర్చు చేయాలన్నారు. అనంతరం నాయీబ్రాహ్మణులకు రాజకీయ శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించారు. స్టేట్ కోఆర్డినేటర్ సత్యకృష్ణ, కార్యదర్శి ప్రభాకర్, టౌన్ ప్రెసిడెంట్ త్రిమూర్తులు, నాయకులు బాబూరావు, అప్పారావు, లోవరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెట్రేగిపోతున్న బైకు దొంగలు

- రాత్రిళ్లు దారి దోపిడీలతో ఆందోళన
- భయాందోళనలో సరిహద్దు వాసులు


జోలాపుట్టులో ఎటువంటి తనిఖీలు చేయని ఆంధ్రలోకి ప్రవేశించే సరిహద్దు ప్రధాన మార్గం


రాత్రిపూట లబ్బూరు జంక్షన్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: ఆంధ్ర – ఒడిశా సరిహద్దులో బైకు దొంగలు పెట్రేగిపోతున్నారు. ఇంటి వద్ద పార్కు చేసిన బైకులను చోరీ చేస్తూ వచ్చిన వీరు ప్రస్తుతం దారి కాచి తుపాకులు చూపి బైకులను ఎత్తుకుపోతున్నారు. దీంతో సరిహద్దు వాసులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలో మాకవరం పంచాయతీ సర్పంచ్ గంగాధర్ సోమవారం రాత్రి తన గ్రామానికి వెళ్తుండగా, ఐదుగురు దొంగలు దారి కాచి తుపాకీ చూపించి దారి దోపిడీకి ప్రయత్నించిన విషయం తెలిసిందే. రాత్రిపూట సంఘటన కావడంతో పాటు చోరుల వద్ద తుపాకీలు ఉండడంతో సరిహద్దు గిరిజనులు భీతిల్లుతున్నారు. నాలుగు నెలల్లో ముంచంగిపుట్టులో ఐదు బైకులు ఇంటి వద్ద పార్కు చేయగా ఎత్తుకుపోయారు. ఇవి పల్సర్ 150లే కావడం విశేషం. దొంగతనాలపై పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా ఏవోబీ సరిహద్దులో జోలాపుట్టు, డుడుమ జలాశయాలపైన ప్రధాన మార్గంలో ఆంధ్రలోకి ప్రవేశించే గేట్లు వద్ద నిత్యం గస్తీ నిర్వహించడం, సీసీ కెమెరాలు ఏర్పాటు, రాకపోకలు చేసే వాహనాల నంబర్లు, వాహనదారుల ఫోన్ నంబర్లు నమోదు చేయాలని, అప్పుడే దొంగలను పట్టుకునే ఆస్కారం ఉంటుందని సరిహద్దు గిరిజనులు చెబుతున్నారు.

తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నాం

దొంగతనాలపై పోలీసు శాఖ అప్రమత్తం అయిందని, తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. సోమవారం రాత్రి మాకవరంలో సర్పంచ్ గంగధార్‌పై దొంగలు ప్రవర్తించిన తీరుపై విచారణ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం నుంచి లబ్బూరు జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఒడిశా నుంచి ఆంధ్రలోకి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ముంచంగిపుట్టు నుంచి డుడుమ, జోలాపుట్టు మార్గాల్లో సీసీకెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యం


బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి(అరకులోయటౌన్): అరకులోయ నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. అనంతగిరి మండలంలోని జీనబాడు పంచాయతీ దేవరాపల్లి నుంచి పెదకోట ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు, దేవరాపల్లి నుంచి వాలాబు ఆర్‌అండ్‌బీ రహదారి వరకు రూ.59 లక్షలతో చేపట్టనున్న రెండు బీటీ రోడ్ల నిర్మాణానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్మాణానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసినట్టు చెప్పారు. అనంతరం జీనబాడు బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సర్పంచ్ సలుగు మాధవి, ఎంపీటీసీ రంపాల వెంకట రామ లక్ష్మి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి, మాజీ జెడ్పీటీసీ దూర గంగన్నదొర, అరకు అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి సివేరి దొన్నుదొర పాల్గొన్నారు.

సకాలంలో ప్రజలకు సేవలు అందించాలి


సీహెచ్‌సీ ఇన్‌పేషెంటు వార్డులో రోగులు, వైద్యాధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ


వై.రామవరం మండల రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

వై.రామవరం: సిబ్బంది అంతా సక్రమంగా విధులు నిర్వహించి, సకాలంలో ప్రజలకు సేవలందించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ తెలిపారు. ఆమె మంగళవారం సాయంత్రం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూములు రీసర్వే ప్రక్రియపైన, పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంపైన ఆరా తీశారు. మండలంలోని రెవెన్యూపరమైన సమస్యలపై ఆరా తీశారు. సకాలంలో సేవలు అందించడంపై సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఇక్కడ అందుతున్న సేవలపై ఇన్‌పేషెంటు వార్డులో రోగులను అడిగి తెలుసుకున్నారు. వారికి కల్పించిన సౌకర్యాలను తనిఖీ చేశారు. ఇతర సమస్యలను, ఇంకనూ అవసరమైన సౌకర్యాల గురించి ఆస్పత్రి సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించే విధానంపై సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట తహసీల్దార్ పి. వేణుగోపాల్, డీటీ కె. సుధాకరరావు, వైద్యాధికారి డాక్టర్ చైతన్యకుమార్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కల్పనకు ఇంటింటి సర్వే

పీవో కట్టా సింహాచలం


మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం స్థానిక వైటీసీ(యూత్ ట్రెనింగ్‌సెంటర్)లో సచివాలయాల సిబ్బంది, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో 16 నుంచి 59 ఏళ్లలోపు వారిని ఇంటింటి సర్వేలో సచివాలయ సిబ్బంది గుర్తిస్తున్నారన్నారు. సచివాలయం ఒక యూనిట్‌గా సర్వే జరుగుతుందన్నారు. సర్వే పర్యవేక్షణ కోసం ఎంపీడీవోలను కోఆర్డినేటర్లుగా నియమించామన్నారు. సర్వే తర్వాత యువతలో నైపుణ్యాలను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. ఇంటింటి సర్వే కోసం గ్రామాలకు వచ్చిన వారికి పూర్తి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధి కల్పన అధికారి సతీష్, వైటీసీ మేనేజర్ సుదీష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం


నిర్మాణ పనులు నిలిపివేసిన పశువైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గణేశ్వరరావు, తదితరులు


తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న పశువైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గణేశ్వరరావు, తదితరులు

పనులు నిలిపివేసి తహసీల్దారుకు పశువైద్యాధికారుల సంఘం ఫిర్యాదు

అరకులోయ టౌన్: స్థానిక పశుసంవర్ధక శాఖ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను పశువైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిరి గణేశ్వరరావు, సిబ్బందితో కలిసి నిలిపివేశారు. అనంతరం తహసీల్దారు ఎం.వి. ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ బ్లాక్ బి, ప్లాట్ నంబర్ 29లో 55 సెంట్లను ప్రభుత్వం పశుసంవర్ధక శాఖకు కేటాయించిందన్నారు. ఈ స్థలంలో గతేడాది నిర్మాణాలు చేపడుతుండగా కలెక్టర్, తహసీల్దారుకు ఫిర్యాదు చేయగా, పనులు నిలిపివేశారన్నారు. మరలా దౌర్జన్యంగా నిర్మాణం చేయడం సరికాదన్నారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారుల సంఘం సంయుక్త కార్యదర్శి సందీప్, డుంబ్రిగుడ పశువైద్యాధికారి రాజశ్రీ, ప్రాంతీయ పశువైద్యశాల వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: జిల్లాలో మాతాశిశు మరణాలను అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ హాలులో మంగళవారం వైద్యాధికారులు, ఆర్‌ఎంపీలు,పీఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతాశిశు మరణాలను అరికట్టేందుకు వైద్యాధికారులు, సీడీపీవోలతో ప్రతి మంగళవారం సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో వైద్యాధికారులు, సిబ్బంది పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయాలన్నారు.గ్రామాల్లో జర్వాలపై ఇంటింటి సర్వే చేయాలని సూచించారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు ఉండాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి పీహెచ్‌సీ డాక్టర్లకు తెలియజేయాలన్నారు. ఆర్‌ఎంపీ,పీఎంపీలకు వైద్యాధికారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని ఆర్‌ఎంపీ సిల్వర్‌స్టార్ కోరారు. సమావేశంలో ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, వైద్యులు రాధిక, భావన, హరికృష్ణ, సాయి రతన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జీవో 3కు చట్టబద్ధత కల్పించిన తర్వాతే మెగా డీఎస్సీ

కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాచిపెంట చిన్నస్వామి డిమాండ్


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

డుంబ్రిగుడ: విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు జీవో నంబర్ 3కు చట్టబద్ధత కల్పించిన తర్వాతే జనరల్, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్నస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనేక మంది గిరిజన యువత ఉన్నత చదువులు చేసి ఉద్యోగాలు లేక చెన్నై, బెంగళూరు, కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీలో ఉద్యోగాలు గిరిజనులకు దక్కేలా జీవో జారీ చేయాలని కోరారు. నాయకుడు లక్ష్మయ్య, డీఎస్సీ అభ్యర్థులు సోమేశ్వరరావు, కిరణ్ పాల్గొన్నారు.